క్లుప్తంగా

మాజీ వలంటీర్‌కు అన్నా పరామర్శ



ప్రసాద్‌ను పరామర్శిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణంలోని 20వ వార్డుకు చెందిన మాజీ వలంటీర్ బి.ప్రసాద్‌ను మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు బుధవారం పరామర్శించారు. ప్రసాద్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి భరోసా ఇచ్చారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

వైన్‌షాపులో చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్సై

మార్కాపురం: స్థానిక కాలేజీ రోడ్డులో ఉన్న ఒక వైన్‌షాపులో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు వైన్‌షాప్ షట్టర్ తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. షాపులో ఉన్న 18 మద్యం ఫుల్‌బాటిళ్లను చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం డీఎస్పీ నాగరాజు, ఎస్సై సైదుబాబు పరిశీలించారు.

ఖురాన్ కంఠస్థ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



సర్టిఫికెట్లు పొందిన చిన్నారులతో నిర్వాహకులు

మార్కాపురం టౌన్: యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్, జమాతే ఇస్లామీ హింద్ సంయుక్తంగా బుధవారం పట్టణంలోని చిన్నమసీదులో 12 ఏళ్లలోపు బాలబాలికలకు ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించారు. జేఐహెచ్ రాష్ట్ర సలహా మండలి సభ్యులు అష్రఫ్‌అలీ మాట్లాడుతూ.. గత పదేళ్ల నుంచి ఖురాన్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇది ప్రీక్వార్టర్ ఫైనల్ పరీక్ష అని చెప్పారు. విద్యార్థి దశ నుంచే బాలబాలికల్లో నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. పోటీల్లో 120 మంది పాల్గొనగా 18 మంది రాష్ట్ర స్థాయి క్వార్టర్ ఫైనల్‌కు ఎంపికయ్యారన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి ఈనెల 29న మార్కాపురంలో క్వార్టర్ ఫైనల్స్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సికిందర్, అరాఫత్ మసీద్ ఇమామ్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.


కొమరోలులో నీటికి కటకట

- మూడు రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



కొమరోలు : ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మరమ్మతులకు గురైన మంచినీటి మోటారు


కొమరోలు: కొమరోలు పట్టణంలో మూడు రోజులుగా మంచినీరు రాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న మంచినీటి మోటారు మరమ్మతులకు గురికావడంతో మూడు రోజుల నుంచి పంచాయతీ కొళాయిలకు మంచినీరు రావడం లేదు. దీంతో కొమరోలులోని పది వీధులకు నీరు అందకపోవడంతో ప్రజలు తవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అలాగే ఆరు నెలల క్రితం పోస్టాఫీసు వద్ద ఉన్న మంచినీటి మోటారు చెడిపోయినా ఇప్పటి వరకు సంబంధిత పంచాయతీ అధికారులు ఆ మోటారును మరమ్మతులు చేయించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఈ మంచినీటి మోటారునైనా మరమ్మతులు చేయిస్తే కొన్ని వీధుల్లో సమస్య లేకుండా పంచాయతీ కొళాయిలకు మంచినీరు వచ్చేదని, కానీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సామాన్య ప్రజలకు తాగడానికి నీరు లేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మంచినీటి మోటారును మరమ్మతులు చేయించేంత వరకు గ్రామ పంచాయతీ వారు నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కొమరోలు : పోస్టాఫీసు వద్ద గత 6 నెలలుగా మరమ్మతులకు గురైన మంచినీటి మోటారు

- పారిశుధ్య లోపంతో జనంపై దండెత్తుతున్న దోమలు
- గిద్దలూరు నియోజకవర్గంలో విజృంభిస్తున్న జ్వరాలు
- పంచాయతీల్లో అటకెక్కిన ఫాగింగ్ యంత్రాలు
- దోమల నివారణ చర్యలు రికార్డులకే పరిమితం
- 15వ ఆర్థిక సంఘం నిధులున్నా వినియోగించని వైనం

రప్పా.. రప్పా కుట్టేస్తున్నాయ్!





బేస్తవారిపేటలో డ్రైనేజీలో నిలిచిన మురుగు



కందులాపురంలో రోడ్డుపై మురుగు

బేస్తవారిపేట:

ప్రజల రక్తం పీల్చేస్తూ జబ్బులబారిన పడేయడమే కాకుండా ఆస్పత్రుల చుట్టూ తిరిగి ఆర్థికంగా కుంగిపోయేలా చేస్తున్న దోమలను కట్టడి చేయడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. అల్పపీడనాల ప్రభావంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు గిద్దలూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో దోమలు వృద్ధి చెందాయి. జ్వరాలు విజృంభిస్తున్నా ఫాగింగ్ యంత్రాలు ఉపయోగించకుండా పంచాయతీ, పట్టణ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రాల్లో అరకొరగా ఫాగింగ్ చేస్తున్నారు కానీ మైనర్ పంచాయతీల్లో ఫాగింగ్ మిషన్లను అటకెక్కించారు. ఇటీవల కురిసిన వర్షాలకు విష జ్వరాలు, డెంగీ, మలేరియా కేసులు విపరీతంగా నమోదవుతున్నాయి. నియోజకవర్గంలో సుమారు 1800 మందికిపైగా ప్రజలు జ్వరాల బారిన పడగా.. వీరిలో పెద్ద సంఖ్యలో చిన్నారులే ఉన్నారు. జ్వరాలకు కారణమవుతున్న దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. 2022లో అన్ని పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలను ప్రభుత్వం సరఫరా చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వాటిని బయటకు తీయడంలేదు. ఒక పాగింగ్ మిషన్ మూడు గంటల పాటు వినియోగించాలంటే దాదాపు రూ. వెయ్యి నుంచి రూ.3 వేల ఖర్చు అవుతుంది. ఈ నేపథ్యంలో పలు కారణాలను సాకుగా చూపుతూ ఫాగింగ్ యంత్రాలను పక్కన పెట్టేసినట్లు తెలుస్తోంది. ఒక్కో మండలంలో మూడు గ్రామాల్లో కూడా ఫాగింగ్ చేస్తున్న దాఖలాల్లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫాగింగ్ యంత్రాలు వినియోగించి, దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులొచ్చినా.. నిష్ఫలం

పంచాయతీల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. పెద్ద పంచాయతీలకు రూ.5 లక్షలు, చిన్న పంచాయతీలకు రూ.2 లక్షలు నిధులు విడుదలయ్యాయి. వీటిని పంచాయతీల్లో పారిశుద్ధ్యంతోపాటు తాగునీరు, ఇతర వసతులకు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ నిధులతో కాలానుగుణంగా నెలకు మూడు సార్లు ఫాగింగ్ చేయాలి. అయినా అధికారులు, పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

కంటితుడుపు చర్యలతో సరి

దోమల నివారణ కార్యక్రమాలు కంటితుడుపు చర్యలుగా మిగులుతున్నాయి. దోమలు ఉత్పత్తి అయ్యే ప్రదేశాలు గుర్తించి, నిరంతరం ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ చేయాల్సి ఉన్నప్పటికి ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఫ్రైడే డ్రైడే లాంటి కార్యక్రమాల నిర్వహణ తూతూ మంత్రంగా సాగుతోంది. దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ అధికారులు, పీహెచ్‌సీ అధికారులు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు తప్ప క్షేత్ర స్థాయిలో ఎలాంటి మార్పు లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గిద్దలూరు నియోజకవర్గంలో పంచాయతీల వివరాలు

బేస్తవారిపేట	19
కంభం	14
అర్థవీడు	15
రాచర్ల	14
కొమరోలు	14
గిద్దలూరు	19
మొత్తం	95

సకల శుభం.. క్రీస్తు జననం

కరుణామయుడు ఏసు పుట్టిన రోజు వేడుకలను బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తుగా చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. క్రైస్తవులు ఒకరికొకరు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఉదయం నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



మార్కాపురంలో అన్నా రాంబాబును సన్మానిస్తున్న చర్చి ప్రతినిధులు



బోడపాడులో క్రిస్మస్ వేడుకలు



బేస్తవారిపేట : బిలీవర్స్ ఈస్టర్న్ చర్చిలో క్యాండిల్ లైట్ సర్వీస్



పొదిలి : కేక్ కట్ చేస్తున్న విశ్వాసులు



తర్లుపాడు బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



గొట్లగట్టులో ఏర్పాటు చేసిన క్రీస్తు పుట్టుక పాక



పొదిలి : పాములపాడులో ప్రార్థన చేస్తున్న పాస్టర్

కొనకనమిట్ల: కొనకనమిట్ల మండలం పెదారికట్ల పునీత బప్తిస్క యోహాను దేవాలయంలో గరిమిన పెంట ఎస్సీ కాలనీలో ఏసుక్రీస్తు పుట్టుకకు చిహ్నంగా పశువుల పాకను ఏర్పాటు చేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వాగుమడుగు పంచాయతీ బోడపాడు కాలనీలో క్రిస్మస్‌ను పురస్కరించుకొని సర్పంచ్ బూధాల కమలాకర్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు, పలువురు పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా క్రిస్మస్ కేట్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు కె.రాజకుమారి, పాస్టర్స్ జయకుమారి, జేమ్స్, ఏలియా, జ్యోతి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: స్థానిక నంద్యాల రోడ్డులోని పురాతనమైన సీఎస్ఐ చర్చి, క్లబ్ రోడ్డులోని తిరుకుటుంబ చర్చి, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని చర్చి, హోసన్న మందిరం, పీఆర్ కాలనీలోని జీసస్ హోలీ చర్చి, మండలంలోని ముండ్లపాడు, అంబవరం, కేఎస్ పల్లె, పొదలకుంటపల్లె, ఉయ్యాలవాడ, సంజీవరాయుడుపేట గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు గీతాలు ఆలపించడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు బైబిల్ సువార్తల సారాంశాన్ని వివరించారు.

బేస్తవారిపేట: మండలంలోని అన్ని చర్చిల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, గీతాలాపనలు, శాంతిసందేశాలు, చిన్నారుల నృత్య నాటికలు, ప్రభువు సందేశాలతో క్రిస్మస్ పర్వదినాన్ని ఎంతో వైభవంగా జరుపుకొన్నారు. బేస్తవారిపేటలోని ది సెంటినరి తెలుగు బాప్టిస్ చర్చి, సహాయమాత ఆలయాల్లో, టీచర్స్‌కాలనీలోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చిలో మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పొదిలి రూరల్: మండలంలోని చర్చిల్లో లోక రక్షకుడు ఏసుక్రీస్తుకు స్వాగతం పలుకుతూ మంగళవారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల్లో అర్ధరాత్రి కేక్ కట్ చేసి, కొవ్వొతులు వెలిగించారు. పాస్టర్లు మాట్లాడుతూ.. క్రీస్తు మార్గం ప్రపంచ మానవాళికి అనుసరణీయమన్నారు. క్రిస్మస్ సందర్భంగా పలు చోట్ల పేదలకు పండ్లు, దుస్తులు అందజేశారు.

మార్కాపురం: లోక రక్షకుడు యేసు బోధనలు అనుసరణీయమని మాజీ ఎమ్మెల్యే మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భముగా బుధవారం పట్టణంలోని ఎస్సీ బీసీ కాలనీలోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ తోపాటు వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నాను చర్చి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్-2 అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, నాయకులు లయోల చెంచిరెడ్డి, కౌన్సిలర్లు షెక్షావలి, దొడ్డా భాగ్యలక్ష్మి, నాసర్‌వలి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లోని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి పాస్టర్ పులుకూరి అమృత్‌తేజ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముందుగా చర్చి క్వయర్ బృందం ప్రత్యేక గీతాలు ఆలపించింది. చర్చి అధ్యక్ష కార్యదర్శులు డి.శామ్యూల్, పి.జయరావు, ఉపాధ్యక్షుడు జి.ఆర్థర్, కోశాధికారి రామస్వామి, కమిటీ సభ్యులు సతష్, బాబీ, పోలయ్య, ప్రదీప్, విజయకుమారి, సుజాత కుమారి, యూత్ డైరెక్టర్ సౌమ్య, సండే స్కూల్ సూపరింటెండెంట్ గంగాభవానీ, స్త్రీల సమాజం అధ్యక్షురాలు సలోమీ ప్రసాద్, క్వయర్ డైరెక్టర్ పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 50 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఏబీఎం కాంపౌండ్‌లోని సెంట్రింగ్ బాప్టిస్టు చర్చిలో డి.విజయభాస్కర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ విశ్వాసులు క్రిస్మస్ గీతాలు ఆలపించారు.

రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ ఎ.జాన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పొదిలి: స్థానిక సెంటినరీ తెలుగు బాపిస్ట్ చర్చిలో కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పాస్టర్ తేళ్ల జాన్ విక్టర్ దేవుని వాక్యాలను వివరించారు. ఏసుక్రీస్తు మహిమలను తెలిపే గీతాలను భక్తులు ఆలపించారు. అసిస్టెంట్ పాస్టర్ సురేష్, కమిటీ సభ్యులు వసంతకుమార్, సామ్యూల్ శేఖర్, పొదిలి తాలూకా వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రావూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో విశ్వాసులకు ద్రాక్ష జ్యూస్, బాదంపాలు అందజేశారు.

కంభం: స్థానిక హోసన్నా ప్రార్థనా మందిరంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. పలుచోట్ల కేక్ కట్ చేసి క్రిస్మస్‌చ నూతన సంవత్సన శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

తర్లుపాడు: మండలంలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. విశ్వాసులు మంగళవారం అర్ధరాత్రి చర్చికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్‌కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలు చర్చిలు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ జీవించాలని పాస్టర్లు క్రిస్మస్ సందేశం వినిపించారు.

కొమరోలు క్రిస్మస్ వేడుకలు

కొమరోలు: స్థానిక సీఎస్ఐ చర్చిలో మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీస్తు రాకను స్వాగతించారు. బుధవారం చర్చిలతో పాటు గృహాల్లోనూ ప్రార్థనలు చేసి వేడుకలు నిర్వహించుకున్నారు.



మార్కాపురం : బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు



కంభంలో క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా వాజ్‌పేయ్ శత జయంతి



పొదిలిలో నివాళులర్పిస్తున్న విజయలక్ష్మి తదితరులు



మార్కాపురం : వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



బేస్తవారిపేటలో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్ ఆవరణలో మాజీ ప్రధానమంత్రి అటల్‌బిహారీ వాజ్‌పేయ్ 100వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ నారాయణ, బీజేపీ నాయకులు వెంకట రమణ, చక్కా మాధవకృష్ణారావు, పవన్‌కుమార్, టి.వెంకటేశ్వర్లు, రమణ, పాండు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: స్థానిక రాచర్ల రోడ్డులోని మానసిక దివ్యాంగుల పాఠశాల ఆవరణలో బుధవారం వాజ్‌పేయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డా.జె.వి.నారాయణ మాట్లాడుతూ.. భారతను బలమైన దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన గొప్ప నాయకుడు వాజ్‌పేయి అని కొనియాడారు. విద్యార్థులకు చాపలు, స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, పిడతల రమేష్‌రెడ్డి, చంద్రమోహన్, రామాంజనేయులు, గుమ్మా రాముడు, రామకృష్ణ, కనకాలు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ జయంతిని మార్కాపురంలో బీజేపీ నేతల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దోర్నాల బస్టాండ్ సెంటరులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు మద్దెల లక్ష్మి, డి.చంద్రశేఖర్, ఆంజనేయులు, సతీష్, వాసవీ ప్రియ, కరీమ్, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: భారతదేశానికి మాజీ ప్రధాని వాజపేయి అందించిన సేవలు మరువలేనివని బీజేపీ అధికార ప్రతినిధి బెల్లం కొండ విజయలక్ష్మి పేర్కొన్నారు. పార్టీ నాయకులతో కలిసి వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నేతలు మాగులూరి రామయ్య సూరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆకుపాటి లక్ష్మణ, సయ్యద్ ఖాదర్‌బాష, పువ్వాడ నారాయణ, చంద్రశేఖర్, మురళి, నాగేశ్వరరావు, కంతం నాగరాజారావు, ఆర్‌ఎస్‌ఎస్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరులో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులఅర్పిస్తున్న బీజేపీ నాయకులు